జేఎన్‌టీయూహెచ్‌లో క్వాంటం సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ, క్యూక్లెయిర్‌వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో 'క్వాంటం సైబర్ సెక్యూరిటీ' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో 33 మంది అధ్యాపకులు, 37 మంది విద్యార్థులు, ముగ్గురు నిపుణులు పాల్గొన్నారు. విప్రో, మైక్రోసిస్లాజిక్ టెక్నాలజీస్, ఓపెన్‌టెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వంటి వివిధ కళాశాలలు, సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అభివృద్ధి చెందుతున్న క్వాంటం కంప్యూటింగ్ రంగం, సైబర్ సెక్యూరిటీ, దాని ప్రభావాల గురించి అవగాహన కల్పించడంపై ఈ వర్క్‌షాపు దృష్టి సారించింది. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ ఎ.దామోదరం, రిజిస్ట్రార్ ఏ.జయలక్ష్మి, సైబర్‌సెక్యూరిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



కార్యశాలలో నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా మంచి అవకాశాలను సొంతం చేసుకోవచ్చని జేఎన్‌టీయూ అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.కామాక్షిప్రసాద్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో క్వాంటం సైబర్ సెక్యూరిటీ అంశంపై నిర్వహించిన కార్యశాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్వాంటం టెక్నాలజీలో వస్తున్న మార్పులు, ఈ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. సైబర్ సెక్యూరిటీ సమన్వయకర్త ఆర్.శ్రీదేవి, నిపుణులు రూపాలిశర్మ, సాయిశంకర్, భరత్ పాల్గొన్నారు.

'హార్ట్‌ఫుల్ టీచర్'పై అవగాహన కార్యక్రమం

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని యూసీఈహెచ్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో 'హార్ట్‌ఫుల్ టీచర్ -విద్యలో ప్రశాంతత, అనుబంధాన్ని పెంపొందించడం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, విద్యార్థుల భావోద్వేగ అవసరాలను అర్థం చేసుకుంటూ, ప్రశాంతత, సహనం, సానుభూతి, పరస్పర గౌరవంతో కూడిన విద్యా వాతావరణాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించాలని వివరించారు. కార్యక్రమానికి యూసీఈహెచ్ ప్రిన్సిపాల్ డా.జి.వి. నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రఘురామ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా. రంజిత్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపక సభ్యులు హాజరయ్యారు.



అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు

భవిష్యత్తు అంతా క్వాంటమ్ కంప్యూటింగ్‌దే!

- జేఎన్‌టీయూ అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో క్వాంటమ్ సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రాముఖ్యత ఏర్పడిందని జేఎన్‌టీయూ అకాడమిక్ అండ్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ వి.కామాక్షి ప్రసాద్ అన్నారు. యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) ఇన్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శనివారం 'క్వాంటమ్ సైబర్ సెక్యూరిటీ'పై నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తు అంతా క్వాంటమ్ కంప్యూటింగ్‌దేనని చెప్పారు. భవిష్యత్తులో అవసరమయ్యే అడ్వాన్స్ ఫీచర్స్‌పై విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్వాంటం కంప్యూటింగ్‌లో సెక్యూరిటీ అవకాశాలు విస్తారంగా ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలో క్యూక్లెయిర్‌వాయర్స్ సంస్థతో కలిసి క్వాంటమ్ సైబర్ సెక్యూరిటీపై జేఎన్‌టీయూలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీఓఈ సమన్వయకర్త ప్రొఫెసర్ శ్రీదేవి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీల ప్రభావాల గురించి అవగాహన కల్పించడమే వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. సాంప్రదాయ క్రిప్టోగ్రాఫిక్ వ్యవస్థలకు క్వాంటం కంప్యూటింగ్ కలిగించే సవాళ్లను అధిగమించడానికి క్వాంటం-నిరోధక భద్రతా యంత్రాంగాల ఆవశ్యకత ఉందన్నారు. ఈ సెషన్లలో క్వాంటం కంప్యూటింగ్ ప్రాథమిక అంశాలు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి అంశాలు నిపుణులు చర్చించారని చెప్పారు. వర్క్‌షాప్‌లో మొత్తం 73 మంది పాల్గొనగా, వీరిలో 33 మంది అధ్యాపకులు, 37 మంది విద్యార్థులు, విప్రో, మైక్రోసిస్లాజిక్ టెక్నాలజీస్, ఓపెన్‌టెక్ట్స్ ఇండియా నుంచి మరో ముగ్గురు నిపుణులు హాజరైనట్లు చెప్పారు. క్యూక్లెయిర్‌వాయర్స్ సంస్థ సలహాదారు రూపాలీ శర్మ, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



రూపాలీ శర్మకు జ్ఞాపికను అందిస్తున్న డైరెక్టర్ కామాక్షిప్రసాద్, చిత్రంలో కోఆర్డినేటర్ శ్రీదేవి